క్లుప్తంగా

వైభవంగా గరుడ సేవ


ప్రత్యేక అలంకరణలో పాండురంగ విఠలేశ్వరస్వామి

సీతారామపురం: మండలంలోని నారాయణ ప్పపేట సమీపంలో ఉన్న పాండురంగ విఠలే శ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళ వారం సింగారెడ్డిపల్లి, నాంచారమ్మపల్లి గ్రామాల వారు స్వామివారికి వైభవంగా గరు డసేవ నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. బుధవారం రాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి సహస్ర ఘట రుద్రాభిషేకాలు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపాలిటీ పరి ధిలోని తిరునాళ్లతిప్ప వద్ద వెలసిన కాశీనా యన ఆశ్రమంలో మూడు రోజులపాటు మహా సహస్ర ఘట రుద్రాభిషేకాలు నిర్వ హించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు మంగ ళవారం తెలిపారు. తొలి రోజు బుధవారం కాశీవిశ్వేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకం , వరుణ జపం, హోమం నిర్వహించ నున్నట్లు తెలిపారు. రెండో రోజు గురు వారం 1,008 ఘటాలతో సహస్ర ఘటాభి షేకం, 3వ రోజు శుక్రవారం ఏకాదశ రుద్రాభిషేకం, హోమాలు, మహాపూ ర్ణాహుతి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.

కంప్యూటర్ల బహూకరణ



సంగం: మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో 550 మార్కులకు పైగా సాధించిన విద్యార్థు లకు మంగళవారం కంప్యూటర్లు బహూకరిం చారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు ద్వారా నెల్లూరు చంద్రశేఖర్ కంప్యూటర్స్ అధి నేత 550కు పైగా మార్కులు సాధించిన మౌనిక, ఎం.ప్రదీప్తి, షేక్ ఆయేషా, షేక్ షఫీయా, ఎం.హారికలకు కంప్యూటర్లు బహూక రించారు.

మండల సమావేశం వాయిదా

దుత్తలూరు: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం తగినంత కోరం లేక వాయిదా వేసినట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి దుత్తలూరు బిట్-1 ఎంపీటీసీ సభ్యురాలు మాత్రమే హాజరైనట్లు తెలిపారు. కనీసం ముగ్గురు సభ్యులు హాజరై తేనే సమావేశం నిర్వహించాల్సి ఉందని తెలి పారు. దీంతో కొంతసేపు నిరీక్షించి వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామ న్నారు.

ఆర్బీకేల్లో పచ్చిరొట్ట విత్తనాలు

దుత్తలూరు: మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీతో రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మండల వ్యవసాయా ధికారి ఎస్.వెంకటసుబ్బారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాభై శాతం సబ్సిడీ పోను 10 కేజీల జీలగలు రూ.440, 10 కేజీల జనుములు రూ.440, 8 కేజీల పిల్లి పెసర్లు రూ.536లకు రైతులకు అందజేయ నున్నట్లు తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు రైతుభరోసా కేంద్రాల్లో నగదు చెల్లిం చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఎక రాకు ఒక బ్యాగ్ పచ్చిరొట్ట విత్తనాల చొప్పున అధికంగా ఐదెకరాల వరకు అం దిస్తామని తెలిపారు. రైతులు ఈ అవకా శాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఉచిత ఖత్నాలు

ఆత్మకూరు: ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఆత్మ కూరు పట్టణానికి చెందిన ముస్లిం చిన్నారు లకు ఉచిత ఖత్నాల కార్యక్రమం మంగళ వారం నిర్వహించారు. పట్టణంలోని త్రికోటే శ్వర కల్యాణ మండపంలో కోవూరుకు చెం దిన డాక్టర్ మహమ్మద్ నేతృత్వంలో 50 మం దికిపైగా చిన్నారులకు ఖత్నాలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

బోధనలో 'ఆదర్శ'ం

- 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు
- 'నాడు -నేడు' ద్వారా పూర్తిస్థాయిలో వసతులు
- ప్రవేశానికి భారీగా ఆసక్తి చూపుతున్న విద్యార్థులు


కలిగిరిలోని ఆదర్శ పాఠశాల

కలిగిరి: కార్పొరేట్ పాఠశాలలను తలపించేలా అధునాతన భవనాలు, ఆహ్లాదకరమైన వాతావర ణం, మెరుగైన వసతులు, అత్యుత్తమ విద్యాబోధ నతో కలిగిరి ఆదర్శ పాఠశాల 'ఆదర్శంగా' నిలి చింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నాడు-నేడు' కార్యక్రమం ద్వారా రూ.43 లక్ష లతో పాఠశాలలో పూర్తిస్థాయిలో మౌలిక వస తులు కల్పించారు. పాఠశాలలో సౌకర్యాలు, ఈ ఏడాది విద్యార్థులు సాధించిన ఫలితాలను చూసి తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ ఆదర్శ పాఠశా లలో చేర్పించడానికి ఆసక్తి చూపుతున్నారు.

విద్యార్థులకు వరం

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కలిగిరి ఆదర్శ పాఠశాల వరంగా మారింది. 2013లో ప్రారంభ మైన ఈ పాఠశాలలో 6వ తరగతి నుంచి ఇంటరీ ్మడియట్ వరకు ప్రస్తుతం 574 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు పరిశీలనాత్మక, సృజనాత్మక పద్ధతుల్లో విద్యాబో ధన చేస్తున్నారు. అధునాతన తరగతి గదులు, ల్యాబులు పాఠశాల సొంతం. చదువుల్లో వెనుకబ డిన విద్యార్థుల పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ చూపి ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుం టున్నారు.


పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు:

ఈ ఏడాది పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. 15 మంది విద్యా ర్థులు 500లకు పైగా మార్కులు సాధించారు. 10వ తరగతి ఫలితాల్లో 583 మార్కులతో పి.వీ ణాధరి, 575 మార్కులతో ఎం.మహేష్‌బాబు టాపర్స్‌గా నిలిచారు. ఇంటర్ ఫలితాల్లో డి.మో హనగీత 436 (ఎంపీసీ), బి.ప్రణీత 432 (బైపీసీ), పి.హెప్సిబా 324 (సీఈసీ) మార్కులు, ద్వితీయ సంవత్సరంలో పి.మధుప్రియ 973 (ఎంపీసీ), బి.త్రిపుర 949 (బైపీసీ), ఎం .మాధురి 774 (సీఈసీ) మార్కులతో టాపర్లుగా నిలిచారు.

ఎన్ఎంఎంఎస్, ట్రిబుల్ ఐటీలో సత్తా

కలిగిరి ఆదర్శ పాఠశాలలో చదుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్, ట్రిబుల్ ఐటీ ఫలి తాల్లో సైతం సత్తా చాటుతున్నారు. పాఠశాల ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్)కు 22 మంది, ట్రిబుల్ ఐటీకి 20 మంది విద్యార్థులు ఎం పికయ్యారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ



పాఠశాలలో ప్రతి విద్యార్థి పట్ల ఉపా ధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యా బోధన చేస్తున్నారు. 6వ తరగతిలో ప్రవేశా నికి రాత పరీక్ష నిర్వహించాం. ఇంటర్‌లో చేరడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. 100 మంది విద్యార్థినులకు వసతి గృహం సౌకర్యం ఉంది.

– అన్నవరపు శ్రీనివాసులు, ప్రిన్సిపల్

క్రీడల్లోనూ ఉత్తమ ప్రతిభ

ఆదర్శ పాఠశాల విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారు. జిల్లాస్థాయి పోటీలకు 30 మంది, రాష్ట్రస్థాయి పోటీలకు 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు.


సైన్స్ ప్రయోగాలు చేస్తున్న విద్యార్థులు (ఫైల్)


అధునాతన తరగతి గది

కొట్టాలులో కోదండరామస్వామి ఉత్సవాలు


హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీరాములు

చేజర్ల: మండలంలోని కొట్టాలు గ్రామంలో ఉన్న శ్రీకోదండరామస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా మంగళవారం సీతారాములకు ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. అనం తరం ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసిన హనుమంత వాహనంపై కోదండరామస్వామి కొలువుదీరి గ్రామంలో విహరిస్తూ భక్తులను కటా క్షించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శిం చుకుని నైవేద్యాలు సమర్పించారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోండి


వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అల్లూరు: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు వినియోగించుకో వాలని లైబ్రేరియన్ కోటేశ్వరమ్మ తెలిపారు. అల్లూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబి రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం విద్యార్థులతో కథలు చెప్పించడం, ఆటలు ఆడిం చడం తదితర కృత్యాలు చేయించారు. తల్లిదం డ్రులు విద్యార్థులను గ్రంథాలయాలకు పంపడం ద్వారా వారికి పుస్తక పఠనం అలవడుతుందని తెలి పారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు


సింగారెడ్డిపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సీతారామపురం: ఉదయగిరి నియోజకవర్గంలో పోలీస్ యాక్ట్-30 అమలులో ఉన్నందున గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఉదయగిరి సీఐ గిరి బాబు హెచ్చరించారు. ఆయన మంగళవారం మం డలంలోని సింగారెడ్డిపల్లి, నాంచారమ్మపల్లి గ్రామాల్లో పోలీసు బలగాలతో కవాతు నిర్వహిం చారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండి సన్మార్గంలో నడిచి విద్యావంతులుగా ఎదగాలన్నారు. గ్రామాల్లో అనుమానిత వ్యక్తుల సంచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలపాలన్నారు. ప్రత్యేక కార్యాచరణ ద్వారా హింసాత్మక చర్యలు అరికట్టేం దుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎన్ని కల్లో జరిగిన గొడవలు, ప్రస్తుత పరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్సైలు ఇంద్రసేనారెడ్డి, ఉమాశంకర్, అనూష, ప్రత్యేక పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

భూసారాన్ని పెంపొందించుకోవాలి


చేజర్ల ఆర్బీకేలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

చేజర్ల: పొలాల్లో భూసారాన్ని పెంపొందించుకో వాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీ బీఎస్ చక్రవ ర్తి తెలిపారు. భూసారాన్ని పెంపొందించుకొనే పద్ధతులపై మంగళవారం మండలంలోని చేజర్ల, మడపల్లి ఆర్బీకేల్లో రైతులకు అవగాహన కల్పిం చారు. కార్యక్రమంలో మండల వ్యవసా యాధికారి శశిధర్, ఏడీ డీఆర్సీ వాసు, ఏఈఓ వెంకటేశ్వర్లు, వీఏఏ ఎస్.మమత పాల్గొన్నారు.

ఏఎస్‌పేట మండలంలో..

అనుమసముద్రంపేట: భూసారం పరిరక్షణపై ఏఎస్‌పేట మండలం శ్రీకొలను, చిరమన గ్రామాల్లో మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవ సాయ సహాయ సంచాలకులు వి.దేవసేనమ్మ మాట్లాడుతూ నేల ఆరోగ్యం, భూసారం పరిర క్షణపై రైతులకు అవగాహన కల్పించారు. పచ్చి రొట్ట పైర్లు సాగు చేసి పూత దశలో నేలలో కలియ దున్ని ఎరువుగా ఉపయోగించాలని తెలి పారు. కార్యక్రమంలో ఏఓ రజని, వీఏఏ కె.తు లసి, జె.సంధ్యారాణి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వ్యవసాయశాఖ కార్యాలయంలో..

అల్లూరు: భూసారం పరిరక్షణపై స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయాధికారి విజయభాస్కర్ రైతులకు అవ గాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ వెంకటప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సీతారామపురం: ఉదయగిరి-సీతారామ పురం మార్గంలో 33 కేవీ విద్యుత్ లైన్ మర మ్మతుల కారణంగా సీతారామపురం మం డలంలో బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌సర ఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీహరి మంగళవారం తెలిపారు. విద్యుత్ వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు

కలిగిరి: మండలంలోని సిద్ధనకొండూరులో మంగళవారం 104 వాహనం ద్వారా వైద్యాధి కారిణి బిజ్జం గీతారెడ్డి ప్రజలకు ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందజేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ 104 వాహనంలో అన్నిరకాల మందులు అందుబాటులో ఉం టాయని, ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు దీర్ఘ కాలిక వ్యాధిగ్రస్తులకు ఎంతో ఉపయోగకర మన్నారు. రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు.

కుక్కకాటుకు వ్యక్తి మృతి


నక్కా కృష్ణయ్య (ఫైల్)

సంగం: కుక్క కాటుకు గురై చికిత్స పొందు తున్న వ్యక్తి మృ తిచెందాడు. వివరాలు.. సం గంలో కూలి పనులు చేసుకుని జీవనం సాగి స్తున్న నక్కా కృ ష్ణయ్య (40) ఇటీవల కుక్కకాటుకు గుర య్యాడు. చికిత్సపొందుతూ రెండు రోజుల క్రితం మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం వీధిన పడింది. కృష్ణయ్య మృతితో ఆయన భార్య సుజాత, నలుగురు పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నేర నియంత్రణకే కార్డన్ సెర్చ్


బసినేనిపల్లిలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సీతారామపురం: సమాజంలో నేర నియంత్రణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ఉదయగిరి సీఐ గిరిబాబు తెలి పారు. ఆయన మంగళవారం ఉదయం సీతారా మపురం మండలంలోని బసినేనిపల్లి, ఏసీ నగర్ గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బృందంతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ఆయా ప్రాం తాల్లోని ముఖ్యమైన కూడళ్లు, గ్రామ శివార్లు, అనుమానిత వ్యక్తులు, పాత నేరస్తుల ఇళ్లు, పలు దుకాణాలు, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, రికార్డులు లేని వస్తువులు, వాహనాలు వంటి వాటిని గుర్తించేందుకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వ హించి కొత్తగా అనుమానం ఉన్న వ్యక్తుల గురించి ఆరా తీశారు. పత్రాలు సక్రమంగా లేని పది వాహ నాలను సీజ్ చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసు శాఖ నిర్వహించే కార్డన్ సెర్చ్ కార్యక్రమానికి ప్రజలు సహకరించాల న్నారు. కార్యక్రమంలో ఎస్సైలు అనూష, ఇంద్రసే నారెడ్డి, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ


ఉపాధి కూలీలకు సూచనలిస్తున్న ఏపీఓ నారాయణ

మర్రిపాడు: మండల పరిధిలోని ఖాదర్‌పూర్ గ్రామంలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులను ఏపీఓ పి.వెంకటనా రాయణ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా ఏపీఓ మాట్లాడుతూ నిర్ణయించిన కొలతల మేరకు ఉపాధి పనులు చేసి ప్రభుత్వం ప్రకటించిన దినసరి కూలీ పొందాలని ఉపాధి కూలీలకు సూచించారు. అలాగే వేసవి దృష్ట్యా ఉదయం 6 నుంచి 11 గంటల లోపు పనులను పూర్తి చేసుకో వాలని తెలిపారు. పని ప్రాంతంలో కూలీలకు అవ సరమైన సౌకర్యాలతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మర్రిపాడు మండల పరిధిలో ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనులకు రావాలన్నారు. కార్యక్ర మంలో ఫీల్డ్ అసిస్టెంట్ బాలగంగిరెడ్డి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు


ఇరువర్గాలతో మాట్లాడుతున్న ఆర్డీఓ మధులత

- ఆర్డీఓ మధులత


సంగం: ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు ఎవ రైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ అధికారిణి మధులత హెచ్చరించారు. ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల సందర్భంగా సం గం మండలంలోని చెన్నవరప్పాడులో ఇరువ ర్గాల మధ్య జరిగిన ఘర్షణ చిలికి చిలికి గాలివా నగా మారింది. దీంతో ఆర్డీఓ మధులత, తహసీ ల్దార్ రమాదేవి, సంగం ఎస్సై నాగార్జునరెడ్డి మం గళవారం చెన్నవరప్పాడు గ్రామాన్ని సందర్శిం చారు. ఇటీవల జరిగిన ఘటనకు సంబంధించి ఇరువర్గాలను పిలిపించి మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ రోజు ఏ పార్టీ విజయం సాధించినా బాణసంచా కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించినా చర్యలు తప్పవన్నారు. ఎలాంటి ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండా లన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందికి అభినందన



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేట మండలం చిర మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందిని హైద రాబాద్‌లోని రెయిన్‌బో హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కంచర్ల రమేష్ అభినందించారు. మంగళవారం చిర మన పీహెచ్‌సీలో జరిగిన అభినందన సభలో వక్తలు మాట్లాడుతూ చిరమన పీహెచ్‌సీ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న డాక్టర్లు జ్యోతి రాణి, నాగవినూత, ఆరోగ్య సిబ్బం దిని అభినందించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈఓ షఫీ, పీహెచ్ఎన్ జ్యోతి, కంచర్ల రమేష్ నాయుడు మేనల్లుడు ఉప్పుగండ్ల అంకయ్యచౌదరి, సురేంద్ర, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అడవిని తలపిస్తున్న బొగ్గేరు


బోయలచిరివెళ్ల-గొల్లపల్లి మధ్యలో బొగ్గేరులో ఏపుగా పెరిగిన కంపచెట్లు

ఆత్మకూరురూరల్: మర్రిపాడు మండలం చాబోలు పాయలో పుట్టి ఆత్మకూరు మండలం అప్పారావుపాళెం, సంగం మండలం వీర్లగుడి పాడు మధ్య పెన్నానదిలో కలుస్తున్న బొగ్గేరు గ్రామాలకు జీవజలాలు అందిస్తూ వరప్రదాయి నిగా ఉంది. అయితే గత కొన్ని దశాబ్దాలుగా బొ గ్గేటి ప్రవాహం సమతుల్యం దెబ్బతినడంతో పలుచోట్ల కంపచెట్లు మొలచి అడవిని తలపిస్తోం ది. భారీ వర్షాలు కురిసినప్పుడు బొగ్గేటి ప్రవాహా నికి తీవ్ర ఆటంకం కలిగిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఆత్మకూరు మండలంలోని ఆరవీడు జంగాలపల్లి, బోయలచిరివెళ్ల, నారంపేట ప్రాం తాలతోపాటు సువ్వారుపాడు, బట్టేపాడు, అప్పారావుపాళెం వరకు ఉన్న బొగ్గేరులో సుమారు 15 కిలోమీటర్ల మేర కంపచెట్లు పెరి గాయి. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేసున్న ఉపాధి హామీ పథకం ద్వారా బొగ్గేరు పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటే భూగర్భజలాల పరిరక్షణతోపాటు బొగ్గేరు పరీవాహక ప్రాం తాల్లో పంటలు సాగు చేసుకున్న రైతులకు భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయని సంబంధిత గ్రామాల రైతులు అభి ప్రాయపడుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జనం నాడి కోసం ఐవీఆర్ఎస్ కాల్స్

సీతారామపురం: గతంలో ఎన్నికల కన్నా ఈసారి పోలింగ్ శాతం పెరగడంతో ఎవరికి వారు తమకు అనుకూలంగా ఫలితాలు వస్తాయని అం చనాలు వేసుకుంటున్నారు. సందట్లో సడేమియా అన్న చందంగా పందెంరాయుళ్లు కూడా బరిలోకి దిగారు. ఎక్కడెక్కడి నుంచో ఐవీఆర్ఎస్ మాది రిగా ఫోన్ కాల్స్ చేసి ఎవరికి ఓటేశారు, ఎవరు గెలవడానికి అవకాశం ఉందని ఓటర్లను అడుగు తున్నారు. ఒకవైపు ఐపీఎల్ పందేలు జోరుగా జరుగుతుండగా అదేస్థాయిలో ఎన్నికల ఫలితా లపై పందేలకు పందెంరాయుళ్లు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఎవరివైపు పందెం కాస్తే బాగుం టుందనే దానిపై ఐవీఆర్ఎస్ మాదిరిగా ఓటర్లకు ఫోన్ చేసి తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక సమయంలో ప్రజల మనో గతం తెలుసుకునేందుకు రాజకీయ పార్టీలు ఫోన్ ద్వారా సర్వేలు చేశాయి. ఇందులో చంద్రబాబు నాయుడు ఎక్కువగా ఐవీఆర్ఎస్ కాల్స్ చేసి ప్రజలను ఇబ్బందిపెట్టారని పలువురు అంటు న్నారు. ప్రజాభిప్రాయం మేరకు అభ్యర్థులను ఖరారు చేయనప్పటికీ తాను అనుకుంటున్న వాళ్లకి, వ్యతిరేకిస్తున్న వారికి ఆ అభిప్రాయ సేక రణ చూపించి అభ్యర్థుల ఎంపిక ప్రహసనం పూర్తి చేశారు. అదేవిధంగా ఇక ప్రచార సమయం లోనైతే ఫోన్ కాల్స్ ద్వారా ద్వారా ప్రజలను పెద్ద ఎత్తున విసుగెత్తించారు. కాల్స్ చేయడం, చెప్పిం ది వినాలని కోరడం, తమ పథకాలకు ప్రచారం, వైఎస్ జగన్‌పై దుష్ప్రచారం చేయడం వంటివి పెద్ద ఎత్తున చేశారు. ఈ కాల్స్ లిఫ్ట్ చేయలేక ప్రజలు ఇబ్బందిపడ్డారు. పోలింగ్‌తో ఈ కాల్స్ తగ్గుతాయనుకుంటే తిరిగి పందెంరాయుళ్ల కాల్స్ రావడం ప్రారంభమయ్యాయి.

కట్ చేస్తున్న ప్రజలు

ఐవీఆర్ఎస్ మాదిరి కాల్స్‌కు విసుగెత్తిన ప్రజలు పందెంరాయుళ్ల చేసే కాల్స్‌కు గెలుపు అంచనా లను తెలుసుకునేందుకు పలు సంస్థలు చేసే కాల్స్‌కు ప్రజలు పెద్దగా సహకరించడం లేదు. మీరు ఏ పార్టీకి ఓటేశారు, ఎమ్మెల్యే ఓటు, ఎంపీ ఓటు ఎవరికి వేశారని అడుగుతూ అందుకు చెప్పిన అంకెలు నొక్కండి అంటూ కాల్‌లో విసిగిస్తున్నారు. వీటికి అతి కొద్దిమంది మాత్రమే స్పందిస్తుండగా చాలామంది ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుం డానే కాల్స్ కట్ చేస్తున్నారు. దీంతో ఆయా పందెం రాయుళ్లకు, స్టడీ సంస్థలకు జనం నాడి అంతు చిక్కని పరిస్థితి ఏర్పడింది. మొత్తానికి అటు అభ్య ర్థులకు, ఇటు పందెం కాసేవారికి మరోవైపు సర్వేపై ఆధారపడి చేసే స్టడీ సంస్థలకు స్పష్టత రాక ఆస క్తిదారులు గింజుకుంటున్నారు.